క్లుప్తంగా

టీటీడీ బోర్డు మెంబర్ పదవికి సాముల రాంరెడ్డి రాజీనామా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మెంబర్ పదవికి రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను టీటీడీ ఈఓకు పంపినట్లు పేర్కొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా సేవలు అందించేందుకు తనకు గొప్ప అవకాశం కల్పించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గెజిటెడ్ హెచ్‌ఎంగా శ్రీనివాస్


మసరం శ్రీనివాస్

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా మసరం శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట మండలం భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషిచేస్తానన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన ఎంపీపీ శ్రీనివాస్


తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఆయనను హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రూన్సీ

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో శివాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన చిత్తలూరి రూన్సీ గురువారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాదె ఆంజనేయులు, బాదె లింగయ్య, బిట్టు రామకృష్ణ, చెవుల నాగేశ్వరరావు, తూముల నరేష్, చిన నర్సయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో తాగునీటి కూలర్ల ఏర్పాటు


కూలర్లను ప్రారంభిస్తున్న మార్కెట్ సెక్రటరీ అశోక్

కోదాడరూరల్ : కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో రైతుల సౌకర్యార్థం రెండు తాగునీటి కూలర్లు ఏర్పాటు చేసినట్లు కార్యాలయ సెక్రటరీ అశోక్ గురువారం తెలిపారు. దూరప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం రైతులు మార్కెట్, సంతకు వస్తుంటారని వారికి ఇబ్బంది లేకుండా కూలర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కూలర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు చేయిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు పొట్టా శ్రీవిజయకిరణ్

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని గణపవరంలో గతంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాదవ్ నిధుల నుంచి మంజూరైన రూ.25 లక్షలతో గురువారం చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు, తాజా మాజీ సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్ మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో గ్రామంలోని పలు మట్టిరోడ్లను సీసీలుగా మారుస్తున్నట్లు తెలిపారు. నిధులు కేటాయించిన బడుగుల లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముడియాల వెంకట్‌రెడ్డి, కొలిశెట్టి వెంకన్న, జంగం తిరపతయ్య, శెట్టి శంకర్‌రావు తదితరులు ఉన్నారు.

రండి.. మా బడిలో చేరండి!

- ముమ్మరంగా బడిబాట కార్యక్రమం
- ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రచారం
- పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


గుడిబండలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు


కోదాడ పట్టణంలో..

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై గ్రామాల్లో తల్లిదండ్రులు కూడా నమ్మకాన్ని కోల్పోతుండడంతో కొన్ని గ్రామాల్లో పాఠశాలలు మూతపడే స్థాయికి చేరుకున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలను ఎలాగైనా బలోపేతం చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వ చేపడుతున్న జయశంకర్‌సార్ బడిబాట కార్యక్రమం గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పిల్లల బాధ్యత తమదని తల్లిదండ్రులకు హామీ ఇస్తున్నారు. అవాంతరాలు, అడ్డంకులు ఎదురవుతున్నా వాటన్నింటికీ అధిగమిస్తూ, తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా, ఈ నెల 2 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం జరగనుంది.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు..

కోదాడ పట్టణంతో పాటు మండలంలో ప్రాథమిక పాఠశాలలు 39, ప్రాథమికోన్నత పాఠశాలలు 04, ఉన్నత పాఠశాలలు 15 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ప్రస్తుతం 5010 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సంఖ్యకు మరో ఐదు వందలకు పైగా విద్యార్థులను పెంచేందుకు మండలంలోని ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు.

వినూత్న రీతిలో ప్రచారం..

ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, గురుకులాల్లో సీట్లు పొందిన విద్యార్థుల ఫొటోలతో పాటు సౌకర్యాలపై కరపత్రాలు ముద్రించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, అల్పాహారం, ఉచిత పుస్తకాలతో పాటు పలు వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచుతాం



కోదాడ మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నాం. ఇప్పటికే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ముమ్మరంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖచ్చితంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– ఎండీ.సలీంషరీఫ్, ఎంఈఓ, కోదాడ

సమష్టిగా ప్రచారం చేస్తున్నాం



పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో బడిబాట కార్యక్రమం చేపట్టి ప్రచారాన్ని ప్రారంభించాం. గ్రామాల్లో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువకులు సమష్టిగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నాం.

– సైదులు, ఉపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల, రామలక్ష్మీపురం

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. గురువారం నేరేడుచర్లలోని మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పున్నా నాగిని, మెప్మా పీడీ రేణుక, మేనేజర్ వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుంది


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మూలగుండ్ల సీతారాంరెడ్డి

గరిడేపల్లి : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి అన్నారు. గురువారం గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు బచ్చలకూరి కృష్ణప్రసాద్, ప్రేమ్‌కుమార్, రంగయ్య, లక్ష్మీనారాయణ, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన


బొత్తలపాలెంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు

పాలకవీడు : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన అందుతుందని బొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తెలిపారు. ఐదు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ గురువారం వారు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారం అందుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, జానకమ్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ కుటుంబానికి ప్రభుత్వసాయం అందజేత


నగదు అందజేస్తున్న డీటీ నాగేందర్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వీఆర్‌ఏ కాసీం సాహెబ్ బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం రెవెన్యూ ఉద్యోగులు ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరుపున వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ నాగేందర్, ఆర్‌ఐలు సూర్యానారాయణ, షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుశీల, జూనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాసీం సాహెబ్ సేవలు మరువలేనివి..

రెవెన్యూ ఉద్యోగిగా కాసీం సాహెబ్ చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరం మల్లేశ్వరి అన్నారు. గురువారం కాసీం సాహెబ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెట్టి ప్రసాద్, ఇందిరాల వెంకటేశ్వర్లు, దుగ్గి బ్రహ్మం, సుజాత, సోమగాని సైదులు, సోమగాని లక్ష్మి, రసూల్, జనిగ వెంకటేశ్వర్లు, సీహెచ్.విజయ, రవీందర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అండగా భారతి సిమెంట్ పరిశ్రమ


తిమ్మాపురంలో తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లను పంపిణీ చేస్తున్న కంపెనీ అధికారి రజనీకాంత్

అర్వపల్లి : తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ పరిశ్రమ అండగా ఉంటుందని భారతి సిమెంట్ ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ రజనీకాంత్ చెప్పారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో గురువారం భువన సిమెంట్ దుకాణంలో తాపీ మేస్త్రీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్టు పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు చెప్పారు. భారతి సిమెంట్ ఇతర సిమెంట్లతో పోలిస్తే మూడురెట్లు మెరుగైందని చెప్పారు. టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి, డీలర్ దిలీప్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయ బ్రహ్మోత్సవాలు


గీతా మందిర్‌లో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారాంపురంలో గల గీతామందిర్ (గోవింద క్షేత్రం)లో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితులు మంత్రోత్సాల మధ్య ప్రత్యేక పూజలు అనంతరం సూర్యకాంత, శిలాజ అగ్నిఆరాధన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, శాంతిపాకం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండారు కుశలయ్య, చీదేళ్ల వెంకటేశ్వర్లు, వేణు, మట్టయ్య, వెంకటదుర్గ ప్రసాద్, యాదగిరి, శ్రీనివాస్, కష్ణమూర్తి, నారాయణరావు, రామారావు, శివకుమార్, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, రాము, లింగయ్య, అయిల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన పేద, ఒంటరి మహిళ ఖాజాబేగం కుమార్తె జబీన్ వివాహానికి ఎంజీ ఫౌండేషన్ తరఫున రూ.50 వేల ఆర్థికసాయాన్ని గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ నరేష్, రాజేష్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

నడిగూడెం : గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్, రత్నవరం, రామాపురం గ్రామాల ప్రత్యేక అధికారి హేమామాలిని సంబంధిత సిబ్బందిని గురువారం ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దర్జీలకు సన్మానం


దర్జీలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : జాతీయ కుట్టు మిషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నేరేడుచర్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దర్జీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కుట్టు మిషన్ వృత్తిని నమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తున్న మైబెల్లి, శంకర్, జ్యోతిలను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి రామస్వామి, సభ్యులు సైదిరెడ్డి, వెంకట్ రెడ్డి, సైదులు, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవాలి

సూర్యాపేట : సీజనల్ వ్యాధుల నుంచి మనకు మనమే రక్షించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది, ఆర్పీల బాధ్యత ప్రధానమైందన్నారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని మన ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, హెల్త్ అసిస్టెంట్ సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజేత డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెడ్ల ధనుంజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పాస్‌ఫొటో, బయోడేటా, ఆధార్‌కార్డు జీరాక్స్‌తో పాటు విద్యార్హతల జీరాక్స్ సర్టిఫికెట్లను తీసుకుని ఉదయం 10గంటలకు రావాలని, బీఎస్సీ కెమిస్ట్రీ చదివి 2020నుంచి 2024వరకు పాసైన పురుషులు అర్హులని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు అపరిశుభ్రమైన నీరు తాగితే వాంతులు, విరోచనాలు అయ్యే ప్రమాదం ఉందని, అధికారులు గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమల నివారణకు గుంతలు పూడ్చివేసి నీరు నిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. మురుగు కాలువలను తరచూ శుభ్రపరచాలని ఆదేశించారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీఓ హిమం, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై విచారణ జరిపించాలి


డీపీఓ సురేష్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న చింతలపాలెం గ్రామస్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో అక్రమ కట్టడాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు గురువారం చింతలపాలెం వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సీతా పబ్లిక్ స్కూల్ రెండవ బిల్డింగ్‌ను, లేబర్ కాలనీని గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కట్టారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ చేయించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వాణిజ్య పన్నుల చెల్లింపులో కూడా అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారం రోజుల్లో విచారణ చేయిస్తానని డీపీఓ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులు సంజీవరెడ్డి, శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై కొనసాగుతున్న సర్వే


రఘునాథపాలెంలో ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మఠంపల్లి : మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే కొనసాగుతోందని ఎంపీడీఓ ఎం.జానకిరాములు తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలోని 42 ఆవాస గ్రామాల్లో 11వేల 115 ఇళ్లు ఉన్నాయని, ఇప్పటివరకు సుమారు 4 వేల ఇళ్లలో సర్వే పూర్తి అయిందని, మరో మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వలంటీర్లు, హెల్త్ సిబ్బంది, ఐకేపి వీవోఏలతో సుమారు 74 మందితో వార్డుల వారీగా సెల్‌ఫోన్ యాప్‌తో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

మేళ్లచెరువు : దళితుల భూములను ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వేపలమాధవరం గ్రామానికి చెందిన దళితులు గురువారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేపలమాధవరం గ్రామంలోని సర్వే నంబర్ 141 లో గల భూమిలో కంపచెట్లు, రాళ్లను గత పది సంవత్సరాలుగా తొలగిస్తూ చదును చేసిన భూమిని కొందరు అగ్రకులాల వారు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దళితులు, గ్రామస్తులు ఉన్నారు.

ఐదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుక

అర్వపల్లి : ఐదేళ్ల పాలనలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన చివరి విడత మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఐదేళ్లలో మండలంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువలు చెత్త, వ్యర్థాలతో నింపుతున్నారని.. ఇలా అయితే గోదావరి జలాలు కాలువల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతాయని చెప్పారు. ఎస్సారెస్పీ కాలువల వెంట అక్రమంగా టిప్పర్లలో మూసీనదికి మొరాన్ని తరలిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు పడి ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిండితేనే గోదావరి జలాలు ఈ సీజనలో వస్తాయని, లేనిచో ఈ నీళ్లు రావడం కష్టమని ఆ శాఖ అధికారులు చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానిశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, డీఈఈ పిచ్చయ్య, ఎంఈఓ బాలునాయక్, ఏఓ శౌదర్‌రెడ్డి, ఏఈలు అశోక్, మహేష్, గిరిబాబు, హరిస్వరూప్, డాక్టర్లు మణిదీప్, అర్జున్, ఏపీఎం మల్లేష్, ఏపీఓ ఉపేందర్, స్రవంతి, వార్డెన్ రామానుజాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ జలంధర్‌రావు, నవీన్, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల కేంద్రం.. సమస్యలతో సతమతం


అధ్వానంగా చిలుకూరు నుంచి రామ్‌చంద్రానగర్ వెళ్లే రోడ్డు


చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు ఇలా..

- అధ్వానంగా లింకు రోడ్లు
- మూగజీవాలకు సరిగా అందని వైద్యం
- వేబ్రిడ్జి లేక రైతులకు తిప్పలు

చిలుకూరు : విప్లవాల పురిటిగడ్డ, కమ్యూనిస్టుల అడ్డా అయిన చిలుకూరు గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. పేరుకే మండల కేంద్రం అయినా అభివృద్ధి శూన్యమని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తుంటారు. దాదాపుగా ప్రతి ఇంట్లో గేదెలు ఉంటాయి. కానీ చిలుకూరులోని పశువైద్య కేంద్రంలో ఒకే ఒక డాక్టర్ ఉండడంతో పశువులకు చికిత్సకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులు ఉంటారు. కానీ గ్రామంలో పండించిన పంట కాంటా వేసేందుకు వేబ్రిడ్జి లేక సతమతం అవుతున్నారు. వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు..

చిలుకూరు నుంచి పలు గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు, రామ్‌చంద్రానగర్ వెళ్లే రోడ్డు, చిలుకూరు హరిజనవాడ దగ్గర నుంచి నారాయణపురం (తాళ్లబాట) అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుకు బీటీగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే చిలుకూరు శివాలయం నుంచి బేతవోలు రోడ్డును బీటీగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రావినారాయణరెడ్డి కాలనీకి వెళ్లేందుకు మరో రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు



మా పొలాలకు వెళ్లే ఆర్లెగూడెం రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతలమయంగా మారి కనీసం బైక్ కూడా వెళ్లలేని స్థితిలో ఉంది. వర్షం వస్తే ఆ రోడ్డులో వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. చిలుకూరు నుంచి ఆర్లెగూడెం లింకు రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు. తక్షణమే రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలి.

– పిల్లుట్ల రమేష్, చిలుకూరు